# వాన జాడ లేదు.. పంటల బాట మార్చండి!






**వర్ధన్నపేట/ఆగస్టు 13 (జర్నలిస్ట్ వార్త):** వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో రైతులు పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగులో మార్పులు చేసుకోవాలని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు సూచించారు. నీటి లభ్యత తక్కువగా ఉన్నందున ఎక్కువ నీరు అవసరమయ్యే వరి సాగును తగ్గించి, తక్కువ నీటితో పండే కంది, పెసర, వేరుశనగ, నువ్వులు, జొన్నలు, రాగి, కొర్రలు, ఉలవలు వంటి పంటలను సాగు చేయాలని కోరారు. వర్ధన్నపేట రైతు వేదికలో గురువారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఇంచార్జి జిల్లా వ్యవసాయ అధికారి విజయ్‌భాస్కర్, జిల్లా ఉద్యానవన, సెరికల్చర్ అధికారి ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు. చెరువుల్లోకి నీరు తక్కువగా చేరుతుండటంతో పాటు బోరుబావుల్లో నీటిమట్టాలు పడిపోతున్నాయని అధికారులు తెలిపారు. అందువల్ల రైతులు ముందుగానే పంటల ప్రణాళిక చేసుకోవాలని సూచించారు. కంది, పెసర తదితర విత్తనాలను వ్యవసాయ శాఖ ద్వారా అందుబాటులో ఉంచుతున్నామని, యూరియా, ఇతర ఎరువులకు కొరత లేదని స్పష్టం చేశారు.

తక్కువ నీటితో సాగు చేయగల కూరగాయలు, ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఆయిల్‌పామ్‌కు కోతుల బెడద తక్కువగా ఉంటుందని, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.